క్లుప్తంగా

వైభవంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం



పుష్పాలంకరణలో సాయినాథుడు

కొమ్మాది: పద్మావతి కాలనీలోని షిర్డీ సాయి మందిరం 16వ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మొదటి రోజు ఉచిత సామూహిక సాయి సత్య వ్రతాలు, మూడు కోట్ల శ్రీ సాయి నామములు గల సాయి కోటి పుస్తకాలతో బాబా ఊరేగింపు, బాబా తత్వ ప్రవచనాలు నిర్వహించారు.

'వైఎస్సార్ కంటి వెలుగు'లో 85 మందికి పరీక్షలు

ఆనందపురం : మండలంలోని బోనిలో శనివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 85 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు, శంకర్ ఫౌండేషన్ వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెం కొత్తగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాందేవపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, విలాస్కాన్‌పాలెం సర్పంచ్ నల్లి సత్యవతి శనివారం ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్యలు తరచూ తలెత్తుతుండడంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సమస్యను ప్రజలు విన్నవించుకున్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.

శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం నేడు

తగరపువలస: స్థానిక శ్రీ సంపత్ వినాయక సహిత షిర్డీసాయి బాబా ఆలయం 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం జరగనున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామాయణం కామేశ్వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేకువజామున నగర సంకీర్తన, బాబా విగ్రహానికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం మేళతాళాలతో రథోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: విద్యార్థులు శ్రద్ధగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడారు.

త్వరలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడికి లోనవకుండా ప్రశాంతంగా రాయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మి, ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

ఆలయాల్లో మాఘ పౌర్ణమి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

మధురవాడ: మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మధురవాడలోని పలు ఆలయాలుతో పాటు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు దూసి రామలింగస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు.



సముద్ర స్నానమాచరించేందుకు తరలివచ్చిన భక్తులు

తీరం కిటకిట

భీమునిపట్నం: మాఘ పౌర్ణమి సందర్భంగా భీమిలి తీరంలో శనివారం జనం పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. ఉదయం ఐదు గంటల నుంచి భీమిలితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. తీరంలోని చిరువ్యాపారులకు మంచి ఆదాయం లభించింది.

కుంతీమాధవస్వామి ఆలయంలో..

పద్మనాభం: మాఘ పౌర్ణమి సందర్భంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంతుడు, లక్ష్మీ దేవిలను దర్శించుకుని పూజలు చేశారు.

పోలమాంబ ఆలయంలో దుర్గాహోమం

తగరపువలస: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం సంగివలస పోలమాంబ ఆలయంలో అర్చకులు దుర్గాహోమం నిర్వహించారు. ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు నరసింహమూర్తి బృందం ఈ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో ప్రసాద్

వైవీ సుబ్బారెడ్డికి ఘన సత్కారం



రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు



వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన నాయకులు

కొమ్మాది: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై విశాఖకు వచ్చిన వైవీ సుబ్బారెడ్డికి శనివారం భీమిలి నాయకులు ఘన స్వాగతం పలికారు. విశాఖ వ్యాలీ స్కూల్ నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం మీదుగా ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వరకు కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం చేరుకున్న ఆయనకు జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు గజమాలతో సత్కరించారు. అదే విధంగా రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వివిధ విభాగాల అధ్యక్షులు జీరు వెంకటరెడ్డి, ఎలమంచిలి సూర్యానారాయణ, గుడ్ల పోలిరెడ్డి, పాల రమణారెడ్డి, పోతిన హనుమంతు, జీఎస్‌రెడ్డి, మాదు చంటి, బుజ్జి, ముదుండి రాజేశ్వరి, చెరుకూరి రజిని, పోతిన పాత్రుడు, చెన్నాదాస్, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, నొడగల రాంబాబు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొని ఘన స్వాగతం పలికారు.

రహదారి ప్రారంభం

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దరి పద్మావతినగర్‌లో ఏర్పాటు చేసిన బీటి రోడ్డును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనలో మా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గ్రూపు-2 పరీక్షకు సర్వం సిద్ధం

ఆనందపురం : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షకు మండలంలో వివిధ ప్రాంతాలలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుడిలోవలోని ఏక్యూజే డిగ్రీ, పీజీ కాలేజి, ఇక్కడే ఏక్యూజే పీజీ సెంటర్, తర్లువాడలోని యలమర్తి ఫార్మసీ కళాశాల, గిడిజాలలోని సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల, ఇక్కడే ఎస్ఆర్ జూనియర్ కళాశాల, బంటుబిల్లి కల్లాలులోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల, వెల్లంకిలోని రవీంద్రభారతి పాఠశాల, ఆనందపురం ఉన్నత పాఠశాల, గంభీరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల, కొంత్యాంలోని ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో 3,968 మంది విద్యార్థులు గ్రూప్-2 పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు శనివారం సీఐ టీవీ తిరుపతిరావు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టు దిట్టమైన బందోబస్తు చేశామని అన్ని కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ తిరుపతిరావు చెప్పారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: మండలంలో ఆదివారం జరగనున్న గ్రూపు-2 పరీక్షకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పద్మనాభం గోస్తని విద్యా పీఠల్, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఈ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. గోస్తని విద్యాపీఠల్‌లో 216 మంది, , రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 240 మంది పరీక్షలు రాయనున్నారు.



ఆనందపురం పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుపతిరావు

వివాహిత ఆత్మహత్య

తగరపువలస: వలందపేటకు చెందిన సబ్బి అప్పలనారాయణమ్మ శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాలుగేళ్ల క్రితం సబ్బివానిపేటకు చెందిన నవీన్‌తో ఈమెకు వివాహం అయింది. వీరికి మూడేళ్ల ప్రత్యూష, 5 నెలల భాను అను ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు పూర్తి కారణాలు తెలియరాలేదు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్లు అయిన విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం శివాజీపాలెం, శివాజీపార్కు రోడ్డు, డోరు నెం.9-6-35/1 రు కాపులు 1) ఎర్రంకి ఎందు గారి కుమారుడు ఎర్రంకి కరుప్పులు, 2) ఎర్రంకి కరుప్పులు గారి భార్య శ్రీమతి ఎర్రంకి శకుంతల ఇరువురు ఏకస్తులై మాకిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి ప్రస్తుత హక్కుదారు అయిన విశాఖపట్నం జిల్లా, గాజువాక, సీతారామనగర్, బీ.సి. రోడ్డు, డోరు నెం.12-26-7/1 రు కాపులు పోలరౌత్ అప్పలనాయుడు గారి కుమారుడు పోలరౌత్ పోలిరాజు నుండి మా క్లయింట్లు క్రయపర్చుటకు ఒప్పందం కుదుర్చుకొని ది.22-02-2024న క్రయ అగ్రిమెంటు వ్రాయించి కొనియున్నారు. సదరు పోలరౌత్ పోలిరాజు గారు సదరాస్తిని ది.8-11-2023న దస్తావేజు నెం.9622/2023గా విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ జాయింటు సబు రి॥ వారి కార్యాలయములో రిజిస్ట్రీ కాబడిన స్థిరాస్తి క్రయ దస్తావేజు మూలంగా గద్దెపల్లి అమ్మోరు ఉరఫ్ పెద్దఅమ్మోరు, గద్దెపల్లి అమ్మోరు ఉరఫ్ చిన్నఅమ్మోరు, పిరాది లక్ష్మి ఉరుదాను ఎల్లయ్యమ్మ గార్ల తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ అయిన పొంద్రంకి లక్ష్మణ గారి కుమారుడు పొంద్రంకి రామకృష్ణ గారి వలన విశాఖపట్నం జిల్లా, మధురవాడ జాయింట్ సబ్ రి॥ వారి కార్యాలయంలో ది.28-08-2023న దస్తావేజు నెం.7207/2023 జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రీత్యా పొందినారన్నారుస్ తదాది నేటి వరకు అతని స్వాధీనములో గలదనిన్నీ, సదరు ప్రస్తుతం హక్కుదారు నుండి మా క్లయింట్లు క్రయ విషయములో ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు గాని, భాగభరణములు గాని, తనఖాలు గాని, హక్కులు గాని, ఇతర ప్రతిబంధకములు ఏమైనా ఉన్నయెడల మా క్లయింటుకు గాని, మాకు గాని ఈ రోజు నుండి వారంరోజులలో ఆధార పూర్వకముగా, లిఖిత పూర్వకముగా తెలిజేయవలెను. ఎటువంటి ఆక్షేపణలు రానియెడల షెడ్యూల్ ఆస్తిని నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా భావించి, మా క్లయింట్లు క్రయము పొందెదరు. పిదప వచ్చు ఆక్షేపణలు మా క్లయింట్లను బైండు చేయవు.

క్రయ ఆస్తి షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, మధురవాడ జాయింటు సబురి॥ ఇలాకా గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ ఏరియా (రూరల్), రుషికొండ గ్రామము తాలూకు సర్వే నెం.43/2 (2ఎ, 2బి) మరియు 43/3 లలో చేరినటువంటి వాడపాలెం ఏరియాలో గల 251.11 చ॥గజాలు లేక 209.958 చ॥మీ॥లు విస్తీర్ణం గల స్థలము అందలి 150 చ॥అ॥లు గల ఎ.సి.సి. సిమెంటు రేకుల ఇల్లు దరి డోరు నెం.7-30/3 గా గల మొత్తం ఆస్తికి హద్దులు.

తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు; **దక్షిణం:** డోరు నెం.7-30/3 రు గా గల యితరుల డాబా ఇల్లు; **పడమర:** సర్వే నెం.43/2 రులో గల మిగిలిన బాగం స్థలం; **ఉత్తరం:** ఇతరుల డాబా ఇల్లు.

గుమ్మడపు సత్యనారాయణమూర్తి, అడ్వకేట్,
విశాఖపట్నం, డో.నెం.30-12-1, రంగ స్ట్రీట్, దాబా గార్డెన్స్,
ది.25-02-2024. విశాఖపట్నం-530020, సెల్: 91826 32466

చేనేత వస్త్రాలకు చిరునామా ఆంధ్రప్రదేశ్



శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: చేనేత ఉత్పత్తులకు చిరునామా ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్, చేనేత, న్యూఢిల్లీ సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన విక్రయ స్టాల్స్‌ను ఆయన స్థానిక శిల్పారామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో వస్త్రాల తయారీలో ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ మన చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులకు పోటీకాదన్నారు. రానున్న వేసవిలో ధరించడానికి చేనేత వస్త్రాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. మార్చి 8వ తేదీ వరకూ కొనసాగనున్న చేనేత మేళాలో వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి , రాష్ట్ర నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాయత్రీ నగర్ అప్పారావు పాల్గొన్నారు.

విదేశీ చదువులపై విద్యార్థులకు అవగాహన

పీఎంపాలెం: విదేశాలలో చదువుల నిమిత్తం వెళ్లే విద్యార్థులు ప్రపంచ దేశాల కాలమాన పరిస్థితులపై అవగాహన అవసరమని యూకో ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎస్ సుందర్ అన్నారు. పీఎంపాలెంలోని సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానిక్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ ఆన్ స్టార్ట్ అప్ అండ్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో ఎస్ఎస్ సుందర్ మాట్లాడుతూ చదువుకోడానికి వెళ్ల దలచుకున్న దేశం, అక్కడి ఉన్నత విద్యా బోధన చేసే యూనివర్సిటీల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, వసతులపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు.

వీసా, పాస్ పోర్టు నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో కె. అనుదీప్, సాంకేతిక కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ ఆల్వార్ దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు బట్, అకాడమీ డైరెక్టర్ జె.ఆనంద్ చందూలాల్, అడ్మిషన్ ఆఫీసర్ ఏ.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీ అనిల్, డాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

27 నుంచి 9 కేంద్రాల్లో టెట్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. వీరి కోసం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు రావాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సమాచారం కోసం 9849245230, 6305538679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జూనియర్ 'మిస్టర్ ఇండియా'లో కోటిరెడ్డికి మొదటి స్థానం

తగరపువలస: ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు చెన్నైలో జెప్పియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 14వ జూనియర్ మిస్టర్ ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్-2024, 65 కిలోల ప్లస్ దివ్యాంగుల విభాగంలో బోర కోటిరెడ్డి మొదటి స్థానంలో నిలిచాడు. ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో కోటిరెడ్డి ఈ ఘనత సాధించారు. జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు నిడిగట్టుకు చెందిన కోటిరెడ్డి తగరపువలస, సంగివలసతో పాటు నగరంలో పలుచోట్ల శ్రీ ఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్ పేరుతో అధునాతన వ్యాయామశాలలు నిర్వహిస్తూ విజయవంతమైన కోచ్‌గా పలువురి మన్ననలు అందుకున్నారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన సత్తా చాటుకున్నారు. రెండు సార్లు మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చారు. చెన్నైలో మారుమారు కోటిరెడ్డి పతకం సాధించడంపై అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు స్వామి రమేష్, శ్రీనివాసరావు(భీమవరం) తదితరులు అభినందించారు.



65 ప్లస్ దివ్యాంగుల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన కోటిరెడ్డి

సెమీస్‌కు ముంబయి, చెన్నై

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఏ పూల్‌లో ముంబయి పోర్టు, బీ పూల్‌లో చెన్నై పోర్టు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించి సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో ముంబయితో ట్యుటికోరిన్ పోర్టు జట్టు, చెన్నైతో జేఎన్‌పీ జట్టు తలపడనున్నాయి. పోర్టు స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో శనివారం ఉదయం ట్యుటికోరిన్ జట్టు 61-39 పాయింట్లతో పారాదీప్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధ భాగంలో కేవలం (28-21) ఏడు పాయింట్లే ఆధిక్యం సాధించిన ట్యుటికోరిన్ జట్టు.. తర్వాత పుంజుకుని విజయం సాధించింది. భరత్ 26, వేలన్ 14 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో జేఎన్‌పీ జట్టు 31-19తో ఎన్ఎంపీ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధ భాగంలో రెట్టింపు(18-9)పాయింట్లతో జేఎన్‌సీ ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. పార్థీ 15, ప్రమోద్ 10 పాయింట్లతో విజయాన్ని ఖరారు చేశారు. సాయంత్రం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబయి పోర్టు జట్టు 36-16తో న్యూమంగళూర్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధ భాగంలో 18-7లో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన ముంబయి తరపున సౌరభ్‌రౌత్ 15, సౌరభ్ పార్టే 10 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో చెన్నై పోర్టు జట్టు 64-32తో పారాదీప్ పోర్టుపై విజయం సాధించింది. చెన్నై పోర్టు తరపున దినేష్ 12, హరికృష్ణ 11, స్టువర్ట్ 6 పాయింట్లు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో పోర్టులో ఉద్యోగం సాధించిన వెటరన్ ఆటగాళ్లను ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సత్కరించింది.

పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి

ఆనందపురం : బాల్యం నుంచే మంచి పోషకాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుందని వైఎస్సార్ యూనివర్సిటీ (విజయవాడ) అనుబంధ ఫిజియో థెరపీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి ప్రత్యూష చెప్పారు. మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాలను కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ ఇంటి పరిసరాలలోనే పోషకాలు అందించే ఎన్నో కూరగాయలు, ఆకుకూరలు ఉంటాయని వాటిని ఆహారంలో వినియోగించాలని కోరారు.

ఈ సందర్భంగా పోషకాహార విలువలను తెలుపుతూ విద్యార్థులు చేసిన నృత్య రూపకం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యు.వి.వి.ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.



చిన్నారులతో ఫిజియోథెరపీ కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులు

విద్యార్థుల చేరికపై ఉపాధ్యాయుల ప్రచారం

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలను చేర్పాలని శనివారం ఉపాధ్యాయులు ఇంటి ఇంటికీ వెళ్లి అభ్యర్థించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారం ప్రభుత్వం ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం పెడుతుందని ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. జగనన్న గోరు ముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్టు తల్లిదండ్రులకు తెలియజేశారు. హెచ్ఎం శాంతి ప్రసూన, ఉపాధ్యాయులు ఈ ప్రచారం నిర్వహించారు.



విద్యార్థులను చేర్చాలని అభ్యర్థిస్తున్న ఉపాధ్యాయులు

27న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ బి.సుజాత తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జీత భత్యాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం. ఫోన్ : 08933-226022

సీల్డ్ టెండర్లు మరియు వేలం

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 01-12-2022 న రూ.4,25,773/- (అక్షరములా నాలుగు లక్షల ఇరవై అయిదు వేల ఏడు వందల డెబ్బయి మూడు రూపాయలు మాత్రమే) తేది 30-11-2022 నాటికి దర్శిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా 1) కుమారి పరిమి సత్యభరణి, D/o. వెంకట చిరంజీవరావు, 2) శ్రీమతి పరిని సీతామహాలక్ష్మి, W/o. వెంకట చిరంజీవరావు, 3) శ్రీ పరిమి వెంకట చిరంజీవరావు, S/o. (లేటు) సత్యనారాయణ వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని 13(4) క్రింద తే 02-02-2023 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ సుదహరించిన స్థిరాస్తిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నది అలాగా" వేలం వేయుటకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం, ఫోన్ నెం. 08933-226022 వద్ద తేది 27-03-2024 మధ్యాహ్నం 3-00 గంటలకు సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 27-03-2024 బుధవారం మధ్యాహ్నం 3-00 గంటలకు

సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం

తనఖా ఆస్తి వివరములు	బకాయి మొత్తం 31-12-2023 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
జి.వి.యం.సి., విశాఖపట్నం, సర్వే నెం. 28 & 29/1, 2 పార్ట్ పరిధిలో చేరిన విశాఖపట్నం, భీమునిపట్నం, తగరపువలస, చిట్టివలసలోని వలందపేట లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గరలోని బ్లాక్ నెం. 59, వార్డు నెం. 13, ఫ్లాట్ నెం. 22లో అమ్మా రెసిడెన్సీలోని స్టిల్ట్ ఫ్లోర్‌లో 690 చ॥ అడుగులు (అసంపూర్తిగా ఉన్నటువంటి) ఫ్లాట్‌గా ఉన్న డోర్ నెం. 4-59-225/8 (డాక్యుమెంట్ ప్రకారం డోర్ నెం. 4-59/2-244 దగ్గరగల) గా ఉన్నటువంటి ఆర్.సి.సి. స్లాబ్ గ్రూప్ హౌస్ ఇల్లు.	4,87,432/-	9,00,000/-	90,000/-

హద్దులు : తూర్పు: ఫ్లాట్ నెం.23, దక్షిణం: ఫ్లాట్ నెం.30, ఉత్తరం: పార్కింగ్ స్థలం&40 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం. 21.

విస్తీర్ణం : మొత్తం 147.00 చ॥గజములలో అవిభాజ్యపు & విడదీయరాని 31 1/2 చ॥ గజములు

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం పేరున చెల్లించబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 26-03-2024 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌పోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ బిడ్డర్లదారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో సైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థులైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థులైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/డిడి/ క్యాష్ రూపములో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నంలో చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్ణీత గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డిఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ భాగం పైన సైనా ఆస్తి క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థులైన బిడ్డరు వర్తించు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించబడు అన్ని చార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా చార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏదైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణానకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించడు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహ రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అప్పుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీచేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వాటి కాపీ కూడా జతచేయాలి.

తేది : 24-02-2024, విశాఖపట్నం

అధీకృత అధికారి, భీమునిపట్నం బ్రాంచి